

జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారిగా అశోక్‌కుమార్



అశోక్‌కుమార్

అనకాపల్లి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా ఎల్.అశోక్‌కుమార్ బుధవారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఉన్న కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా పనిచేసిన రవికుమార్‌ను విశాఖ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసింది.

బుచ్చెయ్యపేట ఎంపీడీవో విజయలక్ష్మి కన్నుమూత



విజయలక్ష్మి (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వి.విజయలక్ష్మి (61) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. విశాఖలో నివాసం వుంటున్న ఆమె ఈ నెల 14వ తేదీన ఇంటిలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కోమాలోకి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. నాలుగు రోజుల నుంచి వెంటిలేటర్‌పై వైద్యం అందిస్తున్నారు. అయినప్పటికీ స్పృహలోకి రాలేదు. దీంతో వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించడంతో తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విజయలక్ష్మి సుమారు ఏడాది క్రితం బుచ్చెయ్యపేట ఎంపీడీవోగా వచ్చారు. అంతకు ముందు కూడా ఒకసారి ఎంపీడీవోగా పనిచేశారు. మరో పది నెలల్లో పదవీ విరమణ చేయాల్సి వుందని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండుపర్యాయాలు ఎంపీడీవోగా ... మిగతా 8వ పేజీలో

ఫార్మా ప్రమాదాలకు అంతం లేదా?

తరచూ పేలుళ్లు, విషవాయువుల లీకు

- ప్రాణాలు కోల్పోతున్న ఉద్యోగులు, కార్మికులు
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు
- బాధిత కుటుంబాలకు నష్టపరిహారం పంపిణీతో సరి
- ఐదేళ్లలో 51 ప్రమాదాలు...97 మంది మృతి
- తాజాగా సాయిశ్రేయాస్‌లో విషవాయువులు పీల్చి ఇద్దరు ఉద్యోగుల మృతి



గత ఏడాది నవంబరు 2న మెట్రోకెమ్ ఫార్మాలో సంభవించిన ప్రమాద దృశ్యం

పరవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): **ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండడం కలవరపెడుతున్నది. భారీ ప్రమాదాలు జరిగి కార్మికులు మృతి చెందుతున్నా అధికారులు, సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు చేపట్టకపోవడం ఆరోపణలకు తావిస్తున్నది. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకునే ధోరణిలో ఇటు అధికారులు, అటు కంపెనీల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు మాత్రం తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.**



ఈ నెల 12న విషవాయువులు పీల్చడంతో ఇద్దరు ఉద్యోగులు మృతిచెందిన సాయిశ్రేయాస్ పరిశ్రమ

ఉమ్మడి జిల్లాలోని విశాఖ ఫార్మాసిటీలో 105, అచ్యుతాపురం సెజ్‌లో 210 పరిశ్రమలు ఉన్నాయి. ఇవి కాకుండా నక్కపల్లిలో హెటిరో డ్రగ్స్ కంపెనీ ఉంది. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో గత ఏడాది జరిగిన భారీ పేలుడు సంభవించి 17 మంది చనిపోయారు. దీనిపై అన్ని శాఖల అధికారులు హడావిడి చేశారు. కూటమి నేతలు పరామర్శలకు క్యూ కట్టారు. ప్రమాదం ఎలా జరిగిందో తేల్చడానికి ప్రభుత్వం ... మిగతా 8వ పేజీలో



గత ఐదేళ్లలో పరవాడ ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాలు, మృతులు

ఏడాది	ప్రమాదాలు	మరణాలు
2019-20	13	17
2020-21	9	31
2021-22	11	12
2022-23	6	11
2023-24	4	29
2024-25	8	6
మొత్తం	51	106

అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీల్లో..

అచ్యుతాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఏర్పాటైన ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఫార్మా కంపెనీల్లో గత రెండున్నరేళ్ల కాలంలో పలు ప్రమాదాలు సంభవించాయి. 2023 జనవరి 30న జీఎఫ్ఎంసీ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి ఒకరు మృతిచెందారు. అదే ఏడాది జూన్ 30న సాహితీ ఫార్మా కెమికల్స్ రియాక్టర్ పేలి ఆరుగురు మృతిచెందారు. 2024 జూలై 17న వసంత కెమికల్స్‌లో రియాక్టర్ పేలి ఒకరు మృతిచెందారు. ఆగస్టు 21న ఎసెన్షియా కర్మాగారంలో రియాక్టర్ పేలి 17 మంది చనిపోయారు.

రాంకీ యాజమాన్యానికి పీసీబీ నోటీసులు

- మల్లోడి గెడ్డలోకి రసాయన వ్యర్థాలను విడిచిపెట్టడంపై చర్యలు

పరవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్‌కు డెవలపర్‌గా వ్యవహరిస్తున్న రాంకీ యాజమాన్యానికి బుధవారం నోటీసులు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పీసీబీ) ఈఈ పీవీ ముకుందరావు తెలిపారు. రాంకీ యాజమాన్యం గత నెల 18వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా పరవాడ మల్లోడి గెడ్డలోకి విడిచిపెట్టింది. దీనిపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, భరణికం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొండా తాతారావు, పెదిశెట్టి సత్యారావు మరుసటి రోజు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఇక్కడకు వచ్చి మల్లోడి గెడ్డలో నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. సీటీవో, హెచ్‌డబ్ల్యుఏ నిబంధనలు పాటించలేదని పీసీబీ గుర్తించింది. ఇందుకుగాను రాంకీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్టు ఈఈ ముకుందరావు తెలిపారు. తదుపరి చర్యలు కోరుతూ పీసీబీ ప్రధాన కార్యాలయానికి నివేదిక సమర్పించినట్టు ఆయన చెప్పారు.

పింఛన్లకు వితంతువుల నిరీక్షణ

భర్త చనిపోయిన వారికి పెన్షన్లు ఇవ్వాలని ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఆమోదం

- గ్రామ/ వార్డు సచివాలయాలకు అర్హుల జాబితాలు
- క్షేత్రస్థాయిలో సర్వే చేసి తుది జాబితా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- అర్హుల తుది జాబితాలను ఇంతవరకు ఖరారు చేయని సచివాలయాల సిబ్బంది

(అనకాపల్లి - ఆంధ్రజ్యోతి)



డీఆర్‌డీఏ కార్యాలయం

దేవుడు వరమిచ్చినా... పూజారి కరుణించలేదన్న చందంగా ఉంది జిల్లాలో అర్హులైన వితంతు పింఛన్‌దారుల పరిస్థితి. పింఛన్‌దారుడైన భర్త చనిపోతే, అతని భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించగా, జిల్లాలో అమలుచేసే విషయంలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వితంతువులకు ఆర్థిక భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది.

గత వైసీపీ ప్రభుత్వం భర్తలను కోల్పోయిన వితంతువులకు పింఛన్లు మంజూరులో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఎన్టీఆర్ భరోసా పథకం కింద వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న భర్త మృతి చెందితే, ఆయా వితంతువుకు పింఛన్ అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే కాకుండా ఈ నెల మొదటి వారంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదించింది. 2023 డిసెంబరు 4వ తేదీ నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ వరకు జిల్లాలో 3,904 మంది పురుషులు పింఛన్ తీసుకుంటూ వివిధ కారణాలతో మృతిచెందారు. మండలాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే.. అనకాపల్లి మండలంలో 184 మంది, జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో 135, అచ్యుతాపురంలో 171, బుచ్చెయ్యపేటలో 160, చీడికాడలో 129, చోడవరంలో 177, దేవరాపల్లిలో 157, గొలుగొండలో 144, కె.కోటపాడులో 197, కశింకోటలో 157, కోటవురట్లలో 151, మాకవరపాలెంలో 163, మునగపాకలో 125, నక్కపల్లిలో 147, నర్సీపట్నం మండలంలో 80, నర్సీపట్నం మునిసిపాలిటీలో 87, నాతవరంలో 187, పరవాడలో 98, పాయకరావుపేటలో 192, రాంబిల్లిలో 122, రావికమతంలో 176, రోలుగుంటలో 157, ఎస్.రాయవరంలో 166, సబ్బవరంలో 129, వి.మాడుగులలో 166, ఎలమంచిలి మునిసిపాలిటీలో 72, ఎలమంచిలి మండలంలో 77 మంది వున్నారు. వితంతువులైన వీరి భార్యలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తక్షణమే వితంతు పింఛన్‌లు అందించాలని నిర్ణయించి గ్రామ/ వార్డు సచివాలయాలకు ప్రభుత్వం అర్హుల జాబితాను పంపింది. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అర్హుల నుంచి ధ్రువీకరణ పత్రాలను స్వీకరించి సెర్ప్ వెబ్‌సైట్‌లో మండల అధికారులు అప్‌లోడ్ చేయాలి. అయితే యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ బిజీగా ఉన్న సచివాలయాల సిబ్బంది, వితంతువుల పింఛన్‌లకు అర్హుల జాబితాలను ఇంకా పూర్తి చేయలేదని తెలిసింది. వాస్తవానికి ఈ నెల 12వ తేదీ నుంచి కొత్తగా వితంతు పింఛన్‌లు మంజూరైన వారికి డబ్బులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇంతవరకు ఈ ప్రక్రియ మొదలు కాకపోవడంతో ఆయా లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా డీఆర్‌డీఏ అధికారులు చొరవ తీసుకొని కొత్తగా వితంతు మంజూరైన వారి వివరాలు సేకరించ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

యోగా దినచర్య కావాలి

అంతర్జాతీయ యోగా దినోత్సవంతో విశాఖకు మరింత గుర్తింపు

- హోం మంత్రి అనిత
- రేవుపోలవరం తీరంలో భారీఎత్తున యోగా ప్రదర్శన



రేవుపోలవరం సముద్ర తీరంలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఎస్.రాయవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ యోగా అనేది దినచర్యలో ఒక భాగం కావాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. యోగాంధ్రలో భాగంగా మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం వద్ద బుధవారం ఉదయం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున యోగా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అనితతోపాటు కలెక్టర్ విజయకృష్ణన్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ముఖ్యఅతిథులుగా హాజరై యోగాసనాలు వేశారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ, ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారని, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖలో భారీ ఎత్తున నిర్వహించే కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఈ నగరం పేరు మారుమోగుతుందన్నారు. రేవుపోలవరం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, నిత్యం యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించవచ్చని అన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రోజూ యోగ చేస్తే మానసిక ఒత్తిడి దూరం అవుతుందని ... మిగతా 8వ పేజీలో



యోగాలో పాల్గొన్న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, తదితరులు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కి బ్రేకులు

ఇంధనం లేకపోవడంతో ఆగిన సేవలు

- 16వ తేదీ నుంచి ఎక్కడి వాహనాలు అక్కడే
- సాంకేతిక సమస్య కారణమంటున్న ఉమ్మడి జిల్లా అధికారి



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిలుపుదల చేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

నర్సీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): **తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు బ్రేకులు పడ్డాయి. వాహనాలకు ఆయిల్ కొట్టించకపోవడంతో ఈ నెల 16వ తేదీ నుంచి ఏరియా ఆస్పత్రిలో నిలిపేశారు. జిల్లా మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది.**

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు 2015 డిసెంబరు 31న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పురుడు పోసుకున్న తర్వాత బాలింతను, శిశువును క్షేమంగా ఇంటికి చేర్చడానికి ఈ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. వైసీపీ అధికారం లోకి వచ్చిన తరువాత తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల నిర్వహణపై ప్రభుత్వం శ్రద్ధచూపలేదు. వీటి నిర్వహణ బాధ్యతను అరబిందో ఫార్మా కంపెనీకి అప్పగించింది. వాహనానికి ఇచ్చిన సిమ్ కార్డులో డబ్బులు వేసి అవసరం పడినప్పుడు పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకునే విధంగా ఏర్పాటు చేశారు. అయితే ఈ నెల 16వ తేదీ నుంచి డబ్బులు పడక పోవడంతో వాహనాలకు ఆయిల్ కొట్టలేదు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 22 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఆగిపోయినట్టు తెలిసింది. మూడు రోజులుగా వాహనాలు నిలిచి పోవడంతో బాలింతలు ఆస్పత్రుల నుంచి ఇళ్లకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నది. మరోవైపు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని... మిగతా 8వ పేజీలో



ఏరియా ఆస్పత్రి నుంచి ఎరకన్నపాలెం గ్రామానికి ఆటోలో వెళుతున్న బాలింత

జ్వరాల విజృంభణ

వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్య లోపం

- పెరిగిన దోమలు, ఈగల బెడద
- ఈ నెలలో 17వ తేదీ వరకు 18 మలేరియా కేసులు నమోదు
- ఐదుగురికి డెంగ్యూ, పలువురికి టైఫాయిడ్
- వందల సంఖ్యలో సాధారణ జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రక్త పరీక్షా కేంద్రం వద్ద రోగులు

నర్సీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడం, గిరిజన గ్రామాలు, వాటిని ఆనుకొని వున్న మైదాన ప్రాంతం గ్రామాల్లో పారిశుధ్య లోపం కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు పలురకాల జ్వరాలబారిన పడుతున్నారు. ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు నిర్వహించగా, పలువురికి మలేరియా పాజిటివ్‌గా రిపోర్టులు వస్తున్నాయి. మలేరియాకుతోడు డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో ఈ నెల ... మిగతా 8వ పేజీలో

ఏకోపాధ్యాయులకు నిరాశ

బదిలీ అయినా రిలీవ్ కాలేని పరిస్థితి

- ఆయా పాఠశాలలకు ఎవరినీ నియమించకపోవడమే కారణం
- డీఎస్సీ నియామకాలు పూర్తయ్యేంత వరకూ ఆగాలని విద్యా శాఖ అధికారుల ఆదేశం
- ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మందిపై ప్రభావం
- అన్ని కేడర్లు కలిపి 4,903 మంది బదిలీ
- 153 మంది టీచర్లకు పదోన్నతి



చోడవరం కోమటివీధిలో ఏకోపాధ్యాయ పాఠశాల

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): **ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో బదిలీ అయిన ఏకోపాధ్యాయులకు విచిత్రమైన సమస్య ఎదురైంది. జిల్లాలో కేటగిరీ-3,4 పాఠశాలల్లో (మారుమూల ప్రాంతాల్లో ఉన్న స్కూళ్లు) ఏకోపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన వారు రిలీవ్ కాలేని పరిస్థితి నెలకొంది. తాజా బదిలీల్లో ఏకోపాధ్యాయులు పనిచేసే పాఠశాలలకు మిగిలిన టీచర్లు ఆప్షన్స్ ఇవ్వకపోవడంతో ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం నిర్వహిస్తున్న డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టిన తరువాత ఏకోపాధ్యాయ పాఠశాలలకు టీచర్లను పంపుతామని, అప్పటివరకూ బదిలీ అయిన ఉపాధ్యాయులు అదే పాఠశాలల్లో పనిచేయాలని విద్యా శాఖ స్పష్టంచేసింది.**

ఉమ్మడి జిల్లాలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మారుమూల ప్రాంతాలు అంటే ప్రధాన రోడ్లకు 20 నుంచి 40 కి.మీ. దూరంలో ఉన్న పాఠశాలలను కేటగిరీ 3, 4గా పరిగణిస్తారు. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 వరకూ ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. బదిలీల సమయంలో అక్కడ పనిచేసే టీచర్లకు ఎక్కువగా ప్రాధాన్యం ఉంటుంది. దీంతో మైదానం, నగరం, ప్రధాన కూడళ్లకు సమీపంలోని పాఠశాలలకు వచ్చేశారు. అదే ... మిగతా 8వ పేజీలో

వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండండి

- అచ్యుతాపురం మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్
- సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చిన పలువురు సభ్యులు



సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ఆరంభమవుతున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పష్టం చేశారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన బుధవారం జరిగిన అచ్యుతాపురం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందాలన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. పంచాయతీల పాలకవర్గాలతో పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ కంతాల్లో ఎన్ఆర్‌జీఎస్, ఉద్యాన వనశాఖ అధికారుల సహాయ సహకారాలతో విరివిగా మొక్కలు నాటాలన్నారు. విశాఖలో జరగనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందు దిబ్బపాలెం సర్పంచ్ దిగుమర్తి శాంతికుమారి మాట్లాడుతూ పేదరికంలో ఉన్న తాను కేవలం సర్పంచునన్న ఉద్దేశంతో ఎనిమిదో తరగతి చదువుతున్న తన కుమార్తెకు తల్లికి వందనం పథకం రాలేదన్నారు. జూన్ ఐదు వరకు సమయం ఉందని, దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సూచించారు. తమ పంచాయతీలో రోడ్డుపైకి ఇళ్లను నిర్మించేస్తున్నారని, అలాగే రోడ్లపై ఎవరికి నచ్చినచోట వారు స్పీడ్ బ్రేకర్లు వేసేస్తున్నారని వాపోయారు. చెరువుగట్లను కూడా ఆక్రమించేస్తున్నారని, ప్రశ్నిస్తే తిరగబడుతున్నారని నునపర్తి సర్పంచ్ చుక్క అనూరాధ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి వెంటనే చర్యలు తీసుకోమని ఎంపీడీవో ప్రభాకరరావును ఆదేశించారు. పంచాయతీల తీర్మానాలు లేకుండా ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేస్తున్నారని, కూలీలకు ఏ ప్రాతిపదికన ఎంతకూలి చెల్లిస్తున్నారో తెలియడం లేదని మల్లవరం సర్పంచ్ పిన్నమ రాజు వాసు ఆరోపించారు. దీంతో ఉపాధి హామీ పథకం అధికారులపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అడిగిన పనుల వివరాలు తెలియజేసేందుకు సదరు అధికారులు నీళ్ల నమలడంతో అసలు అధికారులు ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే నిలదీశారు. ఈ పనులపై విచారణ జరిపి నివేదిక తయారు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు నిర్మాణం పూర్తయితే అచ్యుతాపురం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకి కేవలం గంటలో చేరుకోవచ్చునని ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గం అభివృద్ధికి అంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మడుతూరు పాల సంఘం అధ్యక్షుడిగా జగన్నాథరావు ఏకగ్రీవం

అచ్యుతాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మడుతూరు పాల సంఘం అధ్యక్షుడిగా శనివాడ జగన్నాథరావు ఏకగ్రీవంగా ఎన్నికయారు. గత పది సంవత్సరాలుగా ఈ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న శనివాడ ఆనందరావు పదవీ కాలం ముగియడంతో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. అలాగే మరో డైరెక్టర్ శనివాడ పోతురాజు నాయుడు స్థానంలో పారిపల్లి కోటేశ్వర రావు ఏకగ్రీవంగా ఎన్నికయారు. వీరిని ఎమ్మెల్యే విజయకుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి, ఎం.భద్రాద్రి, ఎం.త్రినాథస్వామి, బలిరెడ్డి శ్రీనివాస రావు, నీరుకొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం చరిత్ర సృష్టించాలి

- 21న విశాఖలో నిర్వహించే ఈ వేడుక విజయవంతం అందరి బాధ్యత
- సమావేశాల్లో ఎమ్మెల్యే సుందరపు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ




కూటమి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు.., టీడీపీ శ్రేణుల సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న ప్రగడ, చిత్రంలో పప్పల చలపతిరావు

ఎలమంచిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఈ నెల 21న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవం చరిత్రలో నిలిచిపోయేలా ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో బుధవారం నియోజకవర్గంలో గల కూటమి నేతలతో యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులు హాజరు కానున్న ఈ వేడుకను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఇందుకు అనుగుణంగా రవాణా తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. అనంతరం నాలుగు మండలాల వారీగా జన సమీకరణపై చర్చించారు. ఈ సమావేశంలో నాయకులు బత్తుల రాజశేఖర్, బొద్దపు శ్రీను, గుర్రాల శేఖర్, గొర్లె నానాజీ, కొఠారు శ్రీను, ఊటకూటి రమేష్, శ్రీరామదాసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో...

ఇదిలావుంటే, విశాఖలో నిర్వహించే యోగా దినోత్సవానికి టీడీపీ శ్రేణులంతా తరలి రావాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, రాయలసీమ ఆర్టీసీ ఛైర్మన్ నాగరాజులతో కలిసి బుధవారం ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులతో పాటు యోగాసనాలు వేసేందుకు లక్షలాది మంది విశాఖకు తరలి రానున్నారన్నారు. ప్రపంచ ఖ్యాతి నార్జించేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, నాయకులు ఆడారి మంజు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె నానాజీ, పెంటకోట విజయ్, పీలా తులసీరామ్, రాజాన నారాయణమ్మ, సేనాపతి నాగేశ్వరరావు, ఎరిపిల్లి అజయ్, బొద్దపు రమణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి'

ఎలమంచిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అర్జీల ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో బుధవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు, నాలుగు మండలాల అధికారులతో పాటు కూటమి నాయకులు గుర్రాల శేఖర్, ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చ రాంబిల్లి మండల కమిటీ

రాంబిల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలిలో బుధవారం కిసాన్‌మోర్చ రాంబిల్లి మండల కమిటీని ఏర్పాటు చేసినట్టు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కారే రాముడు, మండల కార్యదర్శి సిగిరెడ్డి నాయుడు తెలిపారు. కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడిగా దిమిలి గ్రామానికి చెందిన నగిరెడ్డి చిన్ని, కార్యదర్శిగా కొనగాల రామునాయుడు, ఉపాధ్యక్షుడిగా కలగా శ్రీను నియామకం అయ్యారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రాముడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

'షర్మిల పర్యటన విజయవంతం చేయండి'

అచ్యుతాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలో ఈ నెల 20న జరగనున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటనను అంతా విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు పార్టీ కార్యకర్తల్లో పోరాట స్ఫూర్తిని నింపేందులో ఆమె అనకాపల్లి విచ్చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాహుల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావి రామసత్యం, దొడ్డి రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండకర్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ కష్టాలు

- రోడ్డు విస్తరణ పనుల కారణంగా తరచూ సమస్య
- విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కల్వర్టులో దిగబడిన లారీ
- 24 గంటలైనా పట్టించుకోక పోవడంతో ఇబ్బందులు


భారీగా నిలిచిపోయిన వాహనాలు


కొండకర్ల జంక్షన్ వద్ద కల్వర్టులో కూరుకుపోయిన భారీ వాహనం

అచ్యుతాపురం రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల కారణంగా అచ్యుతాపురం- అనకాపల్లి ప్రధాన రహదారిలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. కొండకర్ల జంక్షన్ సమీపంలో రోడ్డు ఈ పనులు భారీ యంత్రాలతో శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా సెజ్‌లోని పలు కర్మాగారాల్లో షిష్ట విధులకు వెళ్లే ఉద్యోగులు ఈ కారణంగా అవస్థలు పడుతున్నారు. దీనికితోడు మంగళవారం సాయంత్రం భారీ లోడుతో వెళ్తున్న డంపర్ కొండకర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కల్వర్టులో దిగబడి కూరుకుపోయింది. 24 గంటలు కావస్తున్నా ఆ వాహనాన్ని బయటకు తీయలేదు. ఫలితంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వివిధ కర్మాగారాలకు వాహనాల్లో వచ్చే సరకులు పరిమితి బరువుకు మించి వస్తున్నా అధికారులు పట్టించుకో పోవడం వల్లే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైౖ అధికారులు స్పందించి అటువంటి వాహనాల యజమానులపై చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. అలాగే, కొండకర్ల జంక్షన్ నాలుగురోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. పోలీసు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి నియంత్రించాలని కోరుతున్నారు.

సమష్టి కృషితో పాఠశాలలో సత్ఫలితాలు


జెడ్పీ స్కూల్ హెచ్ఎం, కమిటీ ఛైర్మన్‌లను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

మునగపాక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత రెండేళ్లుగా మంచి ఫలితాలు సాధిస్తోంది, మున్ముందు ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలను అందుకోవా లని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు, వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్ తదితరులు ఆకాంక్షించారు. ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అంతా కృషి చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపునకు శ్రమిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావులను సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమాశంకర్ ఆర్థిక సహాయంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జడ్పీటీసీ పెంటకోట స్వామిసత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, టెక్కలి పరశురాం తదితరులు పాల్గొన్నారు.


యోగాంధ్ర విజేతలకు బహుమతులు



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర హోం మంత్రి వి.అనిత

నక్కపల్లి, జూన్ 18 (అంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు అంశాలకు సంబంధించి పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బహుమతులు పంపిణీ చేశారు. బుధవారం రేవుపోలవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెయింటింగ్ పోటీల్లో నక్కపల్లి మండలం నుంచి మొదటి స్థానంలోను, జిల్లా స్థాయి యోగా స్కిట్‌లో ప్రథమ స్థానం సాధించిన డీఎల్.పురం గ్రామానికి చెందిన వనుము వర్షిణిని హోం మంత్రి అభినందించారు. వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

పాఠశాలల్లో విస్తృతంగా యోగా శిక్షణ


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాల శిక్షణలో విద్యార్థులు

నక్కపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా యోగా శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. బుధవారం నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగా ప్రొటోకాల్ ఆసనాలపై యోగా గురువు దవరసింగి రాంబాబు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దారు నరసింహమూర్తి, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ రఘు, ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి పర్యవేక్షణలో విద్యార్థులకు ఆసనాలు, ప్రాణాయామంపై 45 నిమిషాల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు భీమసేన, కోటేశ్వరరావు, బండయ్య, సతీశ్, సత్తిబాబు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని పెదబోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో నరేశ్ ఆధ్వర్యంలో పిల్లలకు యోగా శిక్షణ విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.జయశ్రీ, ఉపాధ్యాయులు ఆచార్యులు, ఫాల్గుణరావు, పద్మావతి, నాగేశ్వరరావు, రమేశ్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

నాతవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పంచాయతీల్లో నిధులు దుర్వినియోగమయ్యాయని అందిన ఫిర్యాదుపై బుధవారం విజిలెన్స్ అధికారి ఎ.సంతోశ్ విచారణ చేపట్టారు. నాతవరం, ఎంబీపట్నం, గొలుగొండపేట, చినగొలుగొండ పంచాయతీల్లో తక్కువ పనులు చేసి ఎక్కువ నిధులు, కొన్నిచోట్ల పారిశుధ్య పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారని తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పనులను విజిలెన్స్ అధికారి పరిశీలించారు.

సముద్ర తీరాన్ని సందర్శించిన మంత్రి, కలెక్టర్


ఎస్.రాయవరంలోని రేవుపోలవరం సముద్రతీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర హోం మంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ఎస్.రాయవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక కేంద్రమైన రేవుపోలవరం సముద్ర తీర ప్రాంతాన్ని బుధవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రదేశాలను పరిశీలించారు. రేవుపోలవరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న హోం మంత్రి అనిత, అందులో భాగంగా జిల్లా కలెక్టర్‌ను స్వయంగా దగ్గరుండి అక్కడ ప్రాంతాన్ని చూపించారు. అనంతరం విజయకృష్ణన్‌తో హోం మంత్రి పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎన్.వెంకటరాజు, సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, అడవి రాజు, కోడ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు పను పరిశీలన

నక్కపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న బల్క్ డ్రగ్ పార్కు పనులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. బుధవారం మండలంలో పర్యటించిన కలెక్టర్ నిర్మాణంలో ఉన్న కారిడార్ రోడ్డుతో పాటు పెదబోదిగల్లం లేఅవుట్ పనులను పరిశీలించారు. ఈ పనులు వేగవంతంగా పూర్తిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ.రమణ, ఏపీఐసీ జె.నరసింహారావు, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం. జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని కోనవానిపాలెం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని బుధవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు స్వామివారి ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోన అప్పలరాజు, మామిడి నాగరాజు, కోన గుర్రాచార్యులు, కారబోయిన సత్యనారాయణ, కొర్ర శివ, దర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు, ఎస్.రాయవరం సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, సీలాద్రిపురం గ్రామాలతో పాటు నక్కపల్లి మండలం, పెద్దబోదిగల్లం, రామకృష్ణపురం, పెద్దదొడ్డుగల్లు, సీతంపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులతో పాటు పీఎంఐ ఎల్‌సీ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన వివరించారు. ఆయా గ్రామాల వినియోగదారులంతా ఈ విష యాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- మండల వ్యవసాయ శాఖాధికారి ఆదినారాయణ



మంగవరంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ ఆదినారాయణ

పాయకరావుపేట రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక పంట దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఆదినారాయణ తెలిపారు. మండలంలోని మంగవరం, గోపాలపట్నం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన క్షేత్రస్థాయిలో వ్యవసాయ భూములను పరిశీలించి అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగుచేయడం వల్ల పంటలో ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గి పెట్టుబడులు గణనీయంగా తగ్గడంతో పాటు నాణ్యమైన పంట దిగుబడి వస్తుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాలు, రాయితీలపై అవగాహన కల్పించారు. అలాగే రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శిరిష, ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధులు, రైతు సేవాల కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో ప్రభుత్వ ఉద్యోగులు


రేవుపోలవరంలోని యోగాంధ్రలో పాల్గొన్న పాయకరావుపేట అధికారులు

పాయకరావుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం లోని రేవుపోలవరం తీరంలో బుధవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాయకరావుపేట మండలానికి వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం తెల్లవారుజామున పాయకరావుపేట ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి వర్మ, పంచాయతీ కార్యదర్శులు, వార్డు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంగా చేపట్టాలి

- డీఎఫ్‌వో లక్ష్మణ్


కృష్ణాదేవిపేట పార్కులో మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో లక్ష్మణ్

కృష్ణాదేవిపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా చేయాలని జిల్లా సోషల్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో) జి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో బుధవారం వన సంరక్షణ-మన సంరక్షణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా 400 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి కె.సుబ్బారావు, అటవీ సెక్షన్ అధికారి రాజు, పిన్సిపాల్ కె.శ్రీహరి, అదనపు పిన్సిపాల్ రుత్తల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించండి



విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో సురేష్‌కుమార్

కశింకోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థినులకు బుధవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని స్వర్ణకుమారి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీను, వైస్ చైర్మన్ వెంకట్రావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశు దాణా పంపిణీ



తుమ్మపాలలో దాణాను పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారి అనీల్‌కుమార్

తుమ్మపాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధకశాఖ ద్వారా పాడి రైతులకు యాభై శాతం సబ్సిడీపై సమీకృత దాణాను అందిస్తున్నట్టు పశు వైద్యాధికారి అనీల్‌కుమార్ తెలిపారు. బుధవారం తుమ్మపాలలో సబ్సిడీపై దాణాను అందజేసి మాట్లాడారు. రూ. పదకొండ వందల విలువ గల యాభై కేజీల సమీకృత దాణా బస్తాను కేవలం రూ. 555లకే అందిస్తున్నామన్నారు. పశు పోషకాహారాన్ని మెరుగుపరచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి తదితరులు పాల్గొన్నారు.

23న నిరుద్యోగుల సమస్యలపై నిరసన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

తుమ్మపాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్య వైఖరి తగదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేముల కన్నబాబు అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోరతూ ఐదు లక్షల అర్జీలను గవర్నర్ పంపించేందుకు చేపట్టిన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. నిరుద్యోగులకు రూ.మూడు వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు వియ్యపు రాజు, చంటి, అఖిల్, శ్రావణి, అలేఖ్య, తులసీ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా పరవాడ మండల కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

పరవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఐద్వా పరవాడ మండల నూతన కార్యవర్గం ఇక్కడి టిడ్కో గృహ సముదాయం వద్ద బుధవారం ఏర్పాటైంది. అధ్యక్షురాలిగా ఎం.బంగారమ్మ, కార్యదర్శిగా తుంపాల అన్నపూర్ణలను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా జి.సీత, ఆర్.సీతామహాలక్ష్మి, ఎం.సంతోషి, కె.అబద్ధం, వి.మంగ, ఆర్.సీతమ్మ, ఆర్.రమణమ్మ, కె.లక్ష్మి, హస్మద్‌బేగం, కనక మహాలక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వి. మాణిక్యం మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంతో పాటు స్థానిక మహిళలకు ఉపాధి కల్పించాలని కోరారు. ఆగస్టులో ఐద్వా జిల్లా మహా సభలను నిర్వహించనున్నామని తెలిపారు.

అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలకు నోటీసులు

కశింకోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నూరుపాలెంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు పాఠశాలకు నోటీసులు అందజేశామని ఎంఈవో సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కాగా, కొంత మంది విద్యార్థులతో కన్నూరుపాలెంలో అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు విచారణ జరిపి నోటీసులు అందజేశామని చెప్పారు. విద్యాశాఖాధికారి అనుమతులు లేకుండా పాఠశాలను నిర్వహించరాదన్నారు. ఇటువంటి పాఠశాలలకు పిల్లలను పంపితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని అంతా గుర్తించాలని కోరారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలు పట్టివేత



పోలీసులకు పట్టుబడిన గ్రావెల్ లారీలు

కశింకోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగవరం గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు లారీలను అదుపులోకి తీసుకున్నామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పరిశీలించగా మూడు లారీలు పట్టుబడ్డాయని చెప్పారు. తగు చర్యల నిమిత్తం తహసీల్దార్ సత్యనారాయణకు అప్పగించామని వివరించారు.

జమాదులపాలెంలో పైపులైన్లకు మరమ్మతులు

కశింకోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జమాదులపాలెంలో పైపులైన్లకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఇప్పటి వరకు ఇవి లీక్ కావడంతో తాగునీరు రోడ్డుపై వృథాగా పోయేది. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోపోవడంతో మాజీ ఎంపీటీసీ కరక రాజు కుమారుడు సాయికుమార్ తన సొంత నిధులతో మరమ్మతు పనులను చేయించారు.



డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



సబ్బవరం మండలం నారపాడు పరిధిలోని సింహాద్రి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో...

యోగా డే విజయవంతానికి సన్నాహాలు

» ఏర్పాట్లలో అధికారులు.., ఆసనాల సాధనలో విద్యార్థులు బిజీబిజీ



యోగా పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన కోన శ్రీను బృందం



అనకాపల్లిలో సచివాలయ పోలీసులకు దిశా నిర్దేశం చేస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఈనెల 21న జరగనున్న యోగాంధ్రకు వెళ్లే వారి భద్రత పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సచివాలయ పోలీసులకు సూచించారు. ఇక్కడి పోలీస్ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనకాపల్లి నుంచి వెళ్లే విద్యార్థులను జిల్లా అధికారులు సూచించిన మార్గాల్లో విశాఖకు చేర్చి, తిరిగి అదే మార్గాల్లో సురక్షితంగా ఇక్కడికి చేర్చేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. కంట్రోల్ రూమ్‌కు కశింకోట ఎస్ఐను ఇన్‌చార్జిగా నియమించినట్టు చెప్పారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, రూరల్ ఎస్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి రోజూ యోగా సాధనతో ఆరోగ్యం'

అనకాపల్లి టౌన్ : యోగాకు ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని డైట్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. కళాశాలలో బుధవారం ఏర్పాటైన యోగా కార్యక్రమంలో మాట్లాడారు. శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా ప్రతి రోజు యోగా సాధన వల్ల ఒత్తిడిని తగ్గించుకోవచ్చునని వివరించారు. విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా డేను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రామ గ్రామాన యోగా సాధన జరగాలన్న లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. మండలంలోని నారపాడ సింహాద్రి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం యోగా గురువు పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులతో పాటు కళాశాల సిబ్బంది ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా భారదేశంలో పుట్టి ప్రపంచ వ్యాప్తిమయ్యిందన్నారు. యోగా సాధనతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శివప్రసాద్, ఈవోపీఆర్‌డీ చైతన్య, ప్రిన్సిపాల్ బాలమురళీ, దేవీపురం శ్రీవిద్యాట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, కూటమి నాయకులు కొరుపోలు గోవింద, రొంగలి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరంలో 3110 మంది యోగా సాధకులకు బస



సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా సాధకుల బస ఏర్పాట్లను సమీక్షిస్తున్న తహసీల్దార్

సబ్బవరం : విశాఖలో ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్న నేపథ్యంలో 20 తేదీ శుక్రవారం రాత్రికి సబ్బవరంలో 3110 మంది యోగా సాధకులకు బస ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి ఇక్కడున్న వివిధ పాఠశాలలు, కళాశాల్లో జరుగుతున్న ఏర్పాటను బుధవారం సీఐ జి.రామచంద్రరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం, చీడికాడ, కోటపాడు మండలాల నుంచి 3110 మంది యోగా సాధకులు శుక్రవారం రాత్రికి సబ్బవరం చేరుకుంటారన్నారు. వారి కోసం జీజే కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్, మదర్ స్కూల్, ప్రతిభ విద్యాలయం, ఆర్కిడ్ స్కూల్, సన్ రిడ్జ్ స్కూల్, ఫోర్ ఎస్ కళాశాల, జీఎస్ కన్వెన్స్, సిరి ఫంక్షన్ హాల్, బీఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లలో వసతిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రికి భోజనాలు, శనివారం ఉదయం స్నాక్స్ అందజేస్తామన్నారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు నూకరత్నం తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో అనకాపల్లి బృందానికి ప్రథమ స్థానం

కొత్తూరు : రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరుకు చెందిన టీడీపీ నాయకుడు కోన శ్రీను బృందానికి ప్రథమ స్థానం లభించింది. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 26 బృందాలు హాజరుకాగా, వీరిలో కోన శ్రీను బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు వేడుకల్లో కోన శ్రీను, అర్చన, గణేష్, శ్యామ్ చేతనలు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, టూరిజం సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులు మీదుగా జ్ఞాపిక, ధృవపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లికి చెందిన యోగా ప్రతినిధులు, కొత్తూరు వాసులు వీరి విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



గోపూజలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలో గల సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భోగాపురపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో హోమాలు, గోపూజ వంటివి జరిపారు. గురువారం దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలేనికి చెందిన దొడ్డి ప్రకాశరావుకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం రూ.60 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశరావు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కోలుకున్నారన్నారు. కూటమి నేతల సహ కారంతో ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేయగా సదరు నిధులు మంజూరైనట్టు చెప్పారు. వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్ట చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-1 దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, నాయకులు శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు



వైద్యాలయంలో కిడ్నీ వ్యాధిగ్రస్తురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ నాయుడు

అనకాపల్లి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు సూచించారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు అందుతున్న సేవలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాలయానికి కిడ్నీతో బాధపడుతున్నవారు ఎక్కువగా వస్తున్నారని, వారందరికీ మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ద్వారా మూత్రపిండాలను శుద్ధి చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు కేజీహెచ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని, వైద్యాలయంలోని డయాలసిస్ సెంటర్ ద్వారా సేవలు పొందవచ్చునని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు ఆళ్ల రామచంద్రరావు, గొర్లె శేఖర్ పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో మూడు గ్రామాల ప్రజలకు అవస్థలు

» స్వయంభూవరం వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గుంతలు » పలు చోట్ల తేలిన రాళ్లు » మరమ్మతులు చేపట్టాలని అంతా వేడుకోలు



పెద స్వయంభూవరం సమీపంలో దెబ్బతిన్న రహదారి

పరవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావాడ పంచాయతీ సోమునాయుడుపాలెం నుంచి కలపాక పంచాయతీ మూలస్వయంభూవరం మీదుగా స్వయంభూవరం వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దారి పొడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో పాటు రాళ్లపైకి తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రహదారి నిర్వహణను పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి ఎదురైందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గుంతల పూడ్చివేతకు కూడా ఎలాంటి చర్యలు చేపట్టలేదని చెబుతున్నారు. వర్షాలు కురిసే సమయాల్లో ఆయా గుంతల్లో నీరు చేరి మరింత దారుణంగా తయారవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా రాత్రి సమయాల్లో ఈ రహదారిపై ప్రయాణం అంటేనే భయపడుతున్నారు. దీనికితోడు వర్షాలకు సమీపంలోని గెడ్డల ద్వారా వచ్చి నీరు రహదారి మీదుగా పారుతుండడతో కోతకు గురవుతోందని చెబుతున్నారు. ఈ రహదారి దుస్థితిపై తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.



సోమునాయుడుపాలెం సమీపంలో...

నూకాంబికను దర్శించుకున్న డీఎస్పీ



కుటుంబ సభ్యులతో అమ్మను దర్శించుకుంటున్న డీఎస్పీ

అనకాపల్లి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం బాలాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈవో వెంపలి రాంబాబు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పరవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం పంచాయతీల పరిధి హనుమాన్‌నగర్‌లో అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం నుంచి స్వామివారికి పూజలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన జరగనుంది.

పరవాడ ఏవోగా రమాదేవి



పరవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయాధికారిణిగా మొల్లి రమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చోడవరం డివిజన్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు విచ్చేశారు. ఇంతవరకు ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్.చంద్రావతి పెందుర్తి మండలానికి బదిలీపై వెళ్లారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

నాతవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పంచాయతీల్లో నిధులు దుర్వినియోగమయ్యాయని అందిన ఫిర్యాదుపై బుధవారం విజిలెన్స్ అధికారి ఎ.సంతోశ్ విచారణ చేపట్టారు. నాతవరం, ఎంబీపట్నం, గొలుగొండపేట, చినగొలుగొండ పంచాయతీల్లో తక్కువ పనులు చేసి ఎక్కువ నిధులు, కొన్ని చోట్ల పారిశుధ్య పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

గిరిజన గ్రామాల్లో రవాణాపై ప్రత్యేక దృష్టి

- విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర
- లోతేరు, గుంటసీమకు బస్సు సర్వీసులు పునరుద్ధరణ



అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న దొన్నుదొర, అధికారులు, నాయకులు

అరకులోయ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించి బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్ చార్జి సి య్యారి దొన్నుదొర అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి స్థానిక సర్పంచ్ దాసుబాబు, కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులతో కలిసి రెండు బస్సు సర్వీస్సులను పునరుద్ధరించారు. అరకులోయ నుంచి లోతేరు, అరకులోయ నుంచి గుంటసీమ గ్రామాలకు ఈ రెండు సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఉండేవని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసినట్టు దొన్నుదొర తెలిపారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆటోలు, జీపులను ఆశ్రయించి మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో ఈ ప్రాంతాల గిరిజనులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్టు దొన్నుదొర తెలిపారు. భవిష్యత్తులో మరికొన్ని రూతట్లలో ఆర్టీసీ సర్వీసులు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మొదటి టికెట్‌ను దొన్నుదొర తీసుకొని బస్‌సర్వీసులను ప్రారంభించారు. అరకు-లోతేరు బస్సులో నాయకులు, అధికారులు కొంత దూరం ప్రయాణిం చారు. ఈ కార్యక్రమంలో పాడేరు డిపో ఆర్టీసీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు,మహిళా నాయకురాలు బొరిబొరి లక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, వైస్‌ప్రెసిడెంట్ చందూ విజయనిర్మల, కూటమినాయకులు కిల్లో ఆనంద్, అప్పన్నదొర, తులావతి, జ్యోతి, సరస్వతి, శెట్టి లక్ష్మి, లకోయ్ మహదేవ్, శెట్టి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆధార్ అప్‌డేట్‌కు పెదబయలు భవిత కేంద్రం వద్ద తల్లులు, పిల్లలు


సీఎస్సీ సెంటర్ వద్ద సొమ్ము విత్ డ్రాకు క్యూలో నిల్చున్న లబ్ధిదారులు

'తల్లికి వందనం' నగదు కోసం బారులు

- సచివాలయాలు, బ్యాంకులు, ఆధార్ కేంద్రాల వద్ద రద్దీ
- అర్హులకు ప్రభుత్వం మరో ఛాన్స్
- 16 నుంచి 26 తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక గ్రీవెన్స్

పెదబయలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకంలో అర్హులై ఉండి నగదు అందని వారికి సర్కారు మరో ఛాన్స్ ఇచ్చింది. ఈ నెల 16 నుంచి 26 వరకు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేసింది. దీంతో తల్లికి వందన పథకం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ కాని తల్లులు, పిల్లలు సచివాలయాలు, ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. తమకు నగదు ఎందుకు జమ కాలేదో తెలుసుకుంటున్నారు. మండల కేంద్రంలోని భవిత సెంటర్ గత మూడు రోజులుగా తల్లులు, పిల్లలతో కిటకిటలాడుతోంది. మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి పడిగాపులు కాస్తున్నారు. ముంచంగిపుట్టు మండలం నుంచి కూడా ఆధార్ అప్‌డేట్ కోసం ఇక్కడికి వస్తున్నారు. గంటల తరబడి క్యూ నిల్చుంటున్నారు. గ్రీవెన్స్ కార్యక్రమం ఈ నెల 26తో ముగుస్తుండటంతో అధికారులు ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రతీ సచివాలయంలోనూ ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. అలాగే, తల్లికి వందనం నగదు జమ అయిన తల్లులతో బ్యాంక్, సీఎస్సీ సెంటర్స్ వద్ద సందడి నెలకొంది.

జాతీయ రహదారిలో పొంచి ఉన్న ప్రమాదం

డ్రైనేజీలు లేక రోడ్డుపైకి కొండవాలు నుంచి నీరు, ఇసుక మేటలు


కించుమండ వద్ద జాతీయ రహదారిలో ఇసుక మేటలు

డుంబ్రిగుడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అరకు-పాడేరు ప్రధాన రహదారిలోని కించుమండ నుంచి డుంబ్రిగడ వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా కొండవాలు ప్రాంతం వరద నీరు రహదారిపైకి చేరకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే, కించుమండకు ఆనుకుని జాతీయ రహదారిలోని మలుపులో డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్డుపై వరద నీటితోపాటు ఇసుక చేరిపోతోంది.

దీంతో మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కొండవాలు ప్రాంత వరదనీటి అడ్డుకట్టకు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ ద్వారా 10 మందికి పాఠశాలలో ప్రవేశాలు

కొయ్యూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధి గ్రామాల్లో బుధవారం ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ (స్పెషల్‌డ్రైవ్) చేపట్టి పది మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించినట్టు రత్నంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జాన్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బాలలకు పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించి ప్రవేశాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహ ఉపాధ్యాయురాలు నూకాలమ్మ, విద్యా కమిటీ చైర్మన్ నిధి కుమార్, వైస్ చైర్మన్ ఎర్రయ్యమ్మ, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు. నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థుల తల్లుల ఖాతాలో జూలై 5వ తేదీ నాటికి తల్లికి వందనం నిధులు వారి ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం ఈసందర్భంగా హామీ ఇచ్చారు.


రత్నంపేట పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం తదితరులు

'తల్లికివందనంపై వైసీపీ దుష్ప్రచారం'

చింతపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తల్లికివందనం పథకంపై వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలని టీడీపీ నేత, లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం సర్పంచ్‌లకు వర్తింపజేయలేదని, కొంత మందికి నగదు జమకాలేదని, రూ.రెండు వేలు కోత విధిస్తున్నట్టు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ పథకం సర్పంచ్‌లకు సైతం వర్తింపజేశారని, తనకు ముగ్గురు పిల్లలకు సంబంధించిన నగదు రూ.39వేలు నగదు వచ్చిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబంలోను న్న పిల్లలకు తల్లికి వందనం నగదు అందిందన్నారు. సాంకేతిక కారణాలతో నగదు జమకాకపోతే గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌ని కలిసి సమస్యను నివృత్తి చేసుకోవచ్చునన్నారు. తల్లికి వందనంలో రూ.రెండు వేలు నిర్వాహణ ఖర్చులకు ఉపయోగిస్తారని, ఈ నిధులు ఎవరి జేబులోకి వెళ్లిపోలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత చంద్రబాబుకు మాత్రమే దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారం ప్రజలు విశ్వసించడంలేదన్నారు.

వంతెన పనులకు భూమి పూజ


శంకుస్థాపన చేస్తున్న నేతలు

జి.మాడుగుల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లువ్వాసింగి పంచాయతీ పరిధి బొండపల్లి గ్రామస్థులు రవాణా కష్టాలు తీరనున్నట్టు సర్పంచ్ కె. సుబ్బలక్ష్మి అన్నారు. ఈ గ్రామ రహదారిలో వంతెన నిర్మాణానికి రూ.40 లక్షల అంచనా వ్యయం నిధులు మంజూరు కావడంతో బుధవారం వాటి పనులకు ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జి.సన్యాసిదొర, కె.సత్యనారాయణ, పండుదొర, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న దుక్కు పనులు


వి.కోడాపల్లిలో దుక్కులు చేపడుతున్న రైతు

జి.మాడుగుల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఖరీఫ్ సాగుకు అవసరమైన దుక్కు పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పొలాల్లో నీరు చేరింది. దీంతో ఆధునిక యంత్రాలతో పాటు సంప్రదాయ ఎద్దులతో దుక్కు పనుల్లో తతగిరిజన రైతులు బిజీబిజీగా ఉన్నారు.

ముంచంగిపుట్టు ఏవోగా మురళీకృష్ణ


నూతన ఏవోకి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ముంచంగిపుట్టు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారి (ఏవో)గా ఎం.మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న శ్రీనివాసబాబు శ్రీకాకుళం జిల్లా పొందూరు ఏవోగా బదిలీపై వెళ్లారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసనుంచిమురళీకృష్ణను ఇక్కడికి వచ్చారు. అతనికి వ్యవసాయ శాఖ సిబ్బంది పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వ్యవ సాయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి


పాడేరు అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేపట్టిన విద్యార్థులు

పాడేరురూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అంతర్జాతీయ యోగా డే (ఈ నెల 21వ తేదీ)లో అత్యధిక సంఖ్యలో యువతీ, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ రసూల్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో యోగాంధ్రపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది యోగా డేను ఒక భూమి- ఒక ఆరోగ్యం థీమ్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయన్నారు. యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడతాయన్నారు. ఈ అవగాహన ర్యాలీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమై పట్టణ పురవీధుల మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు చేరుకుంది. అక్కడ మానవహారంగా ఏర్పాటై యోగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాక్టీవేసి కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, ఎన్‌ఎస్‌ఎస్.పీవోలు వి.రమేశ్‌బాబు, సీహెచ్. జానకీరామ్, జి.దామోదరం, జి.భాస్కరరావు, అధ్యాపకులు గణేశ్, సుమిత్ర, నిర్మల, సునీత, రాధాకుమారి, ఈ.వి.జయలక్ష్మి, వారిజా, శంకరరావు, చంద్రశేఖర్, పలు కళాశాలల, శ్రీఅక్షర హైస్కూల్, మోదమాంబ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాంధ్ర వేడుకల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

పాడేరు: విశాఖపట్నంలో ఈనెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర వేడుకలకు వెళ్లే గిరిజనులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌కు సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆయన కలిసి యోగాంధ్రపై చర్చించారు. ఈ యోగాంధ్ర వేడుకలకు అధిక సంఖ్యలో గిరిజనులు, విద్యార్థులను తరలిస్తున్నారని, ఈ క్రమంలో వారికి ఎటువంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అంతకు ముందు ఆయన మినుములూరు జీసీసీ రేషన్ డిపోను పరిశీలించారు. ఈ కార్యకమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ నేతలు బాకూరు వెంకటరమణ, పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఉపాధ్యాయుడు మృతి


దామోదరం (ఫైల్‌ఫోటో)

సీలేరు/హుకుంపేట జూన్ 18, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్రం (ఎన్‌ఎస్) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి. దామోదరం (50) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చారు. అనం తరం కాలకృత్యాలు తీర్చుకోవడానికి బాత్ రూమ్‌కి వెళ్లి ఎంత సేపటికీ ఆయన బయటకు రాకపోవడంతో భార్య, కుమారుడు తలుపు తీసి చూడగా ఆయన అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. దీంతో వెంటనే సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి మస్తాన్‌వల్లీ వైద్య పరీక్షలను నిర్వహించి బ్రేయిన్ స్ట్రోక్ వచ్చినట్టు గుర్తించి ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం సీఎస్‌ఆర్ అంబులెన్సులో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేస్తుండగా మృతి చెందారు. ఆయన స్వగ్రామం పెదబయలు మండలం పర్రెడ.. మృతదేహాన్ని వారి స్వగ్రామానికి తరలించారు. దామోదరంనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈయన రెండేళ్లుగా సీలేరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడు ఆకస్మిక మృతితో సీలేరు, స్వ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సీలేరుపాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆయన మృతి మౌనం పాటించి నివాళులర్పించారు.

'ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలి'


బీజేపీ పాడేరు ఇన్‌చార్జి కృష్ణారావు

జి.మాడుగుల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలని ట్రైకర్ డైరెక్టర్, బీజేపీ పాడేరు ఇన్‌చార్జి కూడ కృష్ణారావు ప్రజలను కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అర్హులకు అందించడంలో అధికారులు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.రాంబాబు, కూటమి నాయకులు మత్స్యరాజు, బాలయ్యదొర, పార్వతమ్మ, చిరంజీవి, రామకృష్ణ, సన్యాసయ్య, కొండబాబు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల బకాయిలు చెల్లించకుంటే ఐటీడీఏ ముట్టడి

- సీపీఎం, గిరిజన నేతలు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అరకులోయ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని జన్‌మన్ ఇళ్ల లబ్ధిదారులకు ఉన్న సుమారు రూ.21 కోట్ల బకాయి బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుబాలదేవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 సంవత్సరంలోని పీవీటీజీ గిరిజనులకు ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. అయితే, ఐటీడీఏ పరిధిలోని సుమారు రూ. 21 కోట్ల బకాయి ఉండడంతో గిరిజనులు గృహాలను ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రా ష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల గిరిజనుల ఇళ్ల నిర్మించి ఇస్తున్నామని ప్రకటిస్తూ, వారిని అప్పుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఈనెల 27న పాడేరు ఐటీడీఏను లబ్ధిదారులతో కలిసి ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోని మండల కార్యదర్శి బుజ్జిబాబు, మండల నాయకులు జగన్నాథం, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌లో అక్రమాలపై నిగ్గు తేల్చాలి

- డుంబ్రిగుడ మండల సమావేశంలో ఎమ్మెల్యే మత్స్యలింగం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై నిగ్గు తేల్చాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులపై మండి పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇళ్ల లబ్ధిదారులనుంచి అక్రమ వసూళ్లకు పాల్పడడం సరికాదని ఆ శాఖ అధికారులను హెచ్చరించారు. ఇలా వసూళ్లకు పాల్పడిన ఎవ రైనా ఉపేక్షించేది లేదన్నారు. అరకు నియోజకవర్గ పరిధిలో పీఎం జన్‌మన్ పథకంలో పీవీటీజీ గిరిజనుల సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని వారు ఎంతో ఆశతో ఉన్నారన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని గృహ నిర్మాణ శాఖ సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆయన ఆరోపించారు. అరకులో అక్రమ కట్టడాలతో పాటు అక్రమంగా ఇసుక తరలిపోతుందన్నారు. గిరిజనేతరులు అక్రమ కట్టడాలు చేపడితే కూల్చివేయాలని అధికారులకు ఆదేశించారు. హౌసింగ్ అక్రమాలు, ఇసుక రవాణాపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ప్రజా ప్రతినిధులను అధికారులు భాగస్వామ్యం చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవన స్థితిగతులపై ముందుగా గుర్తించి వాటికి మరమ్మతులపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశానికి పోలీసు శాఖతో పాటు విద్యుత్, ఆర్టీసీ అధికారులు గైర్హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే మండల కేంద్రంలోని పోతంగి సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడంపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. విధుల పట్ల నిర్లక్ష్యం సరికాదన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ , ఉప ఎంపీపీ ఆనంద్, లలిత, ఎంపీటీసీ, సర్పంచ్‌లు , పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో ప్రతి ఒక్కరిలో ఆనందం

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


విలేకరులతో మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని వర్తింప జేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతున్నదని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంత మంది చదువుకుంటే అందరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పథకాన్ని అందించినట్టు ఆయన గుర్తు చేశారు. తల్లికి వందనంతో ప్రజలు ఆనందంగా ఉండడంతో వైసీపీ నేతలు ఈర్షతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అది పద్ధతి కాదని శ్రావణ్‌కుమార్ సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తమ కూటమి ప్రభుత్వం పథకాలను దశల వారీగా అమలు చేస్తున్నప్పటికీ వైసీపీ అవాస్తవాలు ప్రచారం చేయడం ఘోరమన్నారు. ఆ పార్టీ తీరుపై విసిగిన ప్రజలు ప్రతిపక్షహోదా సైతం లేకుండా చేసినా ఇంకా బుద్ధిరాకపోవడం విచిత్రంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాకూరు వెంకటరమణ, పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, ఎ.తిరుపతిరావు, పి.శశిభూషన్, టి.సత్యనారాయణ, వి.శ్రీనివాసరావు, కెసాయిరాజ్ కామేశ్, మురళీ, తదితరులున్నారు.

ఏపీఆర్ గురుకుల బాలుర కళాశాలల్లో 295 సీట్లు భర్తీ

- కళాశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ పారయ్య


ఇంటర్ ప్రథమ సంవత్సరం కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

పాడేరురూరల్, జూన్ 18 (అంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఐదు గిరిజన గురుకుల బాలుర కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన ఉన్న 295 సీట్లు భర్తీ బుధవారం పూర్తి చేసినట్టు జిల్లా గురుకుల కళాశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ యండమూరి పారయ్య తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని పెదబయలు, అరకు వేలి, జి.మాడుగుల, కొయ్యూరు, చింతపల్లి మండలాల్లో గల గిరిజన గురుకుల బాలుర కళాశాలల్లో 800 సీట్లకు గాను గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని పర్యవేక్షణలో గత నెల 27వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. 505 సీట్లు అప్పట్లో భర్తీకాగా 295 సీట్లు ఖాళీగా ఉండటంతో 18వ తేదీ బుధవారం టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజని పర్యవేక్షణలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు వివిధ మండలాలకు చెందిన 450 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో అధిక మార్కులు సాధించిన 295 మందికి సీట్లు కేటాయించి మిగులు సీట్ల భర్తీ చేశామన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో ఆయా ఏపీఆర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో ఒరిగిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం


ఆపిల్ రిసార్ట్స్ సమీపాన నిలిచిన లారీని ఎక్సకవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

అనంతగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొందగుడ-డముకు మధ్యలోని ఆపిల్ రిసార్ట్స్ సమీపాన మలుపువద్ద బుధవారం ఉదయం భారీ కంటైనర్ లారీనిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో సుమా రు గంటపాటుగా ట్రాఫిక్ సమస్యగా మా రింది. మలుపు వద్ద వాహనం పక్కకు ఒరిగి నిలిచిపోవడంతో ఇతర భారీ వాహనాలు వెళ్లేందుకు అ వకాశం లేకపోయింది. దీంతో కంటైనర్ లారీని జేసీబీతో పక్కకు తొలగించడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి.

డిగ్రీ కళాశాలలో యోగాసనాలు


యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అరకులోయ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డి గ్రీ కళాశాల వద్ద బుధవారం ప్రిన్సిపాల్ కె.భరత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని, ప్రతిరోజు సాధన చేయాలని ప్రిన్సిపాల్ కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు 650 మంది విద్యార్థులకు రిజిస్ట్రేషన్ చేయించారు.


చెక్కు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే సత్యానందం

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నర్సీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధ పడుతున్న పలువురు రోగులకు వైద్య ఖర్చుల నిమిత్తం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. స్పీకర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. మాకవరపాలెం తూటిపాల గ్రామానికి చెందిన కొల్లు వరుణ్ శ్రీతేజకి రూ.1,02,373, నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన వెంకునాయుడుకు రూ.63,954, మునిసిపాలిటీ పాత సంతబయలుకు చెందిన మామిడి పార్వతికి రూ.40,595 మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

నర్సీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఏఎంసీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ ఛైర్మన్ చిటికెల కన్నయ్యనాయుడుతో పాటు 13 మంది సభ్యులు స్పీకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు

▸▸ 350 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల సీజ్


ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ సురేంద్ర, సిబ్బంది

నర్సీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ హోల్‌సేల్ దుకాణాలపై మునిసిపల్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. కృష్ణాబజార్, ఇందిరా మార్కెట్, కృష్ణాదేవిపేట రోడ్డులోని ఐదు దుకాణాల నుంచి 350 కిలోల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు సీజ్ చేశారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ హోల్‌సేల్ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తే కేసులు రాస్తామని మునిసిపల్ కమిషనర్ సురేంద్ర హెచ్చరించారు. దుకాణాల్లో అందుబాటులో ఉంచడంతోనే వినియోగం పెరిగిపోతున్నదని, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులు, పేపరు కవర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగించినా నేరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

▸▸ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు


పశు వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీ నరసింహులు

మాకవరపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు చందక నరసింహులు సూచించారు. మాకవరపాలెం పశు వైద్య కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి పశువులకు సంబంధించిన రోగాలపై ఆరా తీశారు. అనంతరం డీడీ మాట్లాడుతూ 50 శాతం రాయితీపై పశుదాణా, పశుగ్రాసం విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది మండలంలో 75 పశువుల షెడ్ల నిర్మాణాలు చేపట్టగా, మొదటి విడతలో 35 షెడ్లు పూర్తయ్యాయన్నారు. పశువులకు నీటి ఎద్దడి లేకుండా మండలంలో 12 నీటి తొట్టెలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పశువులకు నట్టల నివారణ మందులు అందిస్తున్నట్టు చెప్పారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంలో రైతులు ముందుండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం పశు వైద్యాధికారి మణిదీప్ పాల్గొన్నారు.

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

రావికమతం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు నియమించారు. కన్నంపేటకు సేనాపతి పద్మ, టి.అర్జాపురం-2కు మచ్చా వెంకటలక్ష్మి, కె.కొట్నాబిల్లికి ఆరిగెల ప్రసాద్‌లను నియమిస్తూ డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు. వారికి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు బుధవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకన్నబాబు, ఏవో సీతారామస్వామి, ఉపాధి పథకం ఏపీవో చిన్నారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, కన్నంపేట ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంటు శ్రీనివాసరావు, నాయకులు కోసూరు ఆనందరావు, గేదెల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఎంపీడీవో విజయలక్ష్మికి ఘన నివాళులు



ఎంపీడీవో విజయలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శిస్తున్న తాతయ్యబాబు, రాజు

బుచ్చెయ్యపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండల పరిషత్ అభివృద్ధి అదికారిణి వి.విజయలక్ష్మి మృతి వార్త మండల వాసులను కలచి వేసింది. ఈ విషయం తెలియగానే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు బుధవారం హుటాహుటిన విశాఖపట్నం తరలివెళ్లారు. అక్కడ విజయలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈర్లె శ్రీరామూర్తి పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరాపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండ రామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ డి.జగన్ దంపతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలి

▸▸ జిల్లా సోషల్ ఫారెస్టు అధికారి లక్ష్మణ్


కృష్ణాదేవిపేట పార్కులో మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో లక్ష్మణ్, విద్యార్థులు

కృష్ణాదేవిపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేయాలని జిల్లా సోషల్ ఫారెస్టు అధికారి (డీఎఫ్‌వో) జి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో బుధవారం వన సంరక్షణ-మన సంరక్షణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా 400 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందనన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి కె.సుబ్బారావు, అటవీ సెక్షన్ అధికారి రాజు, కళాశాల పిన్సిపాల్ కె.శ్రీహరి, అదనపు పిన్సిపాల్ రుత్తల గంగరాజు, గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు పెట్ల నారాయణమూర్తి, బొడ్డు జమీలు, గాడి అప్పలనాయుడు, లగుడు రాజు, స్వామినాయుడు, కె.అప్పారావు, రమణ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోడవరంలో 60 అడుగుల వినాయక విగ్రహం

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు


సద్భావన ఫౌండేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూన్18(ఆంధ్రజ్యోతి): స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం సమీపంలో రానున్న వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని 60 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహాన్ని నెలకొల్పనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. స్వయంభూ గణపతి ఖ్యాతి మరింతగా తెలిసేలా స్థానిక సద్భావన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సద్భావన ఫౌండేషన్ సభ్యులు, స్థానిక ప్రముఖులతో బుధవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రఖ్యాతిచెందిన స్వయంభూ విఘ్నేశ్వరుడి ఉత్సవాలకు ఆలయానికి వన్నెతెచ్చేలా సద్భావన ఫౌండేషన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 60 అడుగుల భారీ మట్టి విగ్రహం గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఇదే తొలి సారని తెలిపారు. ఈ మట్టి విగ్రహం పనులు పూర్తికావడానికి రెండు నెలలకు పైగా సమయం పట్టే పరిస్థితి ఉందని, త్వరలోనే ఈ వినాయకుని విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సద్భావన ఫౌండర్ రాజేశ్ కొప్పాక, స్వయంభూ విఘ్నేశ్వర ఆలయం అర్చకులు కొడమంచిలి చలపతి, వినాయక, గౌరీశ్వర ఆలయాల ఛైర్మన్లు పి.సాంబమూర్తి, జి.సురేశ్, పి.శ్రీనివాసరావు, చేకూరి రాజు, కోరుకొండ సత్తిబాబు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

నాతవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పంచాయతీల్లో నిధులు దుర్వినియోగమయ్యాయని అందిన ఫిర్యాదుపై బుధవారం విజిలెన్స్ అధికారి ఎ.సంతోశ్ విచారణ చేపట్టారు. నాతవరం, ఎంబీపట్నం, గొలుగొండపేట, చినగొలుగొండ పంచాయతీల్లో తక్కువ పనులు చేసి ఎక్కువ నిధులు, కొన్నిచోట్ల పారిశుధ్య పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారని తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారపు సంత దగ్గర ఎంతమేర గ్రావెల్ పనులు చేశారని కొలతలు తీసుకున్నారు. అలాగే ఫిర్యాదులోని మరికొన్ని అంశాలపై స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని విజిలెన్స్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలం శేషు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వాసవీ క్లబ్ ఆర్థిక సాయం

మాడుగుల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మహాప్రస్థానం పథకం ద్వారా అనేక కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న అంతర్జాతీయ వాసవీ క్లబ్ మాడుగుల మండలంలో తాజాగా మరొకరికి ఆర్థికసాయం అందించింది. మండలంలోని కింతలి, గాదిరాయి రూరల్ వాసవీ క్లబ్ సభ్యుడు, ఒమ్మలి గ్రామానికి చెందిన పుట్టా పెద సూరిబాబు ఇటీవల మృతి చెందారు. ఆయన వాసవీ క్లబ్‌లో సభ్యత్వం కలిగి ఉన్నందున మహాప్రస్థానం పథకం ద్వారా క్లబ్ తరపున రూ25 వేలు ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు శ్రీనాధు శ్రీను, పుట్టా మాధవి, గున్నయ్యశెట్టి, అర్జునరావు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో డ్వాక్రా సభ్యులతో సెర్ప్ అధికారుల సమావేశం


డ్వాక్రా సభ్యులతో మాట్లాడుతున్న సెర్ప్ అధికారులు

బుచ్చెయ్యపేట జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలో నీలకంఠపురం గ్రామంలో బుధవారం సెర్ప్ అధికారులు సమావేశమయ్యారు. సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, అడిషనల్ సీఈవో శ్రీరాములనాయుడు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, టీసీఎస్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని నీలకంఠాపురం, వడ్డాది గ్రామాలను పైలట్ ప్రాజెక్టులుగా 2.0 వెర్షన్ అమలు చేస్తున్నట్టు వారు తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశాన్ని డ్వాక్రా సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజబాబు, సీసీలు, సీఏలు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

1187 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

కె.కోటపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంపిణీకి 1187 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి సోమశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు విత్తనాలు సరఫరా చేసే ముందు రైతు సేవా కేంద్రంలో మొలక కట్టాలని చెప్పారు. అలాగే మాడుగుల విత్తన పరీక్షా కేంద్రంలో కూడా మొలక శాతం పరీక్షించి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ముందుగా ప్రతీ రైతు పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలని సూచించారు. మండలంలో 77 మంది రైతులకు రూ24.77 లక్షల రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశామన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

చీడికాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సిన విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు తెలిపారు. బుధవారం సర్పంచ్ కోడూరు సత్యవతితో కలిసి రైతులకు ఆయన విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విత్తన కొరత లేకుండా చర్యలు తీసుకోండి

రోలుగుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో విత్తన కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏవో చిరంజీవి ఆదేశించారు. బుధవారం రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి ఈ నెల 20లోగా ఈకేవైసీ పూర్తి చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

జానకీరాంపురంలో కోదండరాముని కల్యాణం

గొలుగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం గ్రామంలో బుధవారం కోదండరాముని కల్యాణం ఘనంగా జరిగింది. రామాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గొలుగొండ, నర్సింగబిల్లి, పప్పుశెట్టిపాలెం, శ్రీరాంపురం, పాత మల్లంపేట గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: ఎంపీడీవో

మాడుగుల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో కె.అప్పారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21న యోగా దినోత్సవానికి ప్రతీ గ్రామం నుంచి ముగ్గురు చొప్పున విశాఖపట్నం రావాలని కోరారు. మాడుగుల మండలం నుంచి సుమారు వంద మంది వచ్చేలా యోగా శిక్షణ ఇచ్చామన్నారు. బీసీ వసతిగృహంలో చదువుతున్న 15 మంది విద్యార్థులు కూడా యోగా డేకు బయలు దేరుతారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు డాక్టర్ మౌనిక, జెజగదీశ్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవంలో యువత పాల్గొనాలి

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు


మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు. పక్కన ఎమ్మెల్యే సత్యానందరావు

నర్సీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ సముద్ర తీరంలో ఈ నెల 21న నిర్వహించే అంత ర్జాతీయ యోగా దినోత్సవంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. బుధవారం ఇక్క క్యాంప్ కార్యాలయంలో యోగాంధ్ర నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖలో 5 లక్షల మంది, రాష్ట్ర వ్యాప్తంగా రెండో కోట్ల మంది యోగా దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఐదు వేల మంది విశాఖలో యోగాకు హాజరుకానున్నారని తెలిపారు. విశాఖ వెళ్లి రావడానికి ప్రభుత్వం రవాణా సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ, విశాఖలో నిర్వహించే యోగా దినోత్సవం గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డులో నయోదు కాబోతున్నదని తెలిపారు. ఈ సమావేశంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ 'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా నేరుగా పదవ తరగతి, పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు నేరుగా ఇంటర్మీడియట్‌లో చేరడానికి జూలై 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో జి. అప్పారావునాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ పదవ తరగతిలో చేరడానికి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు వయసు నిండి ఉండాలన్నారు. అలాగే చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, పాఠశాలలో ఏదో ఒక తరగతిలో చదివిన నాటి టీసీ, పుట్టిన తేదీ ధ్రువపత్రం ఉండాలన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్‌లో చేరదలచిన అభ్యర్థులు తగిన రుసుము చెల్లించి పదవ తరగతి ఉత్తీర్ణులైన మార్కుల జాబితా, టీసీ, ఆధార్ జెరాక్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి సమాచారం కోసం 8008902915 నంబరును సంప్రతించాలన్నారు.

డీసీసీబీ లాభం రూ. 1.96 కోట్లు

» పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో డీసీసీబీ రూ.1.96 కోట్ల నికర లాభం ఆర్జించినట్టు బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు తెలిపారు. బుధవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన 62వ మహాజనసభలో ఆయన మాట్లాడుతూ, లాభాలను పురస్కరించుకుని అధికారులు, ఉద్యోగులకు ప్రోత్సాకంగా పది రోజుల వేతనం మంజూరుచేస్తున్నట్టు ప్రకటించారు. అజెండాలో పొందుపరిచిన పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొట్ని బాలాజీ, పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు, నాబార్డు డీడీఎం జి.సామంత్‌కుమార్, ఆప్కాబ్ డీజీఎం రాజీవ్ బాబు, డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం నుంచి క్షమాభిక్షపై

ముగ్గురు ఖైదీలు విడుదల


విశాఖ కేంద్ర కారాగారం నుంచి విడుదలై వస్తున్న ఖైదీలు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారం నుంచి క్షమాభిక్షపై బుధవారం రాత్రి ముగ్గురు ఖైదీలను విడుదల చేసినట్టు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వీరిలో విజయవాడకు చెందిన కె.ప్రసాద్, విజయనగరం జిల్లా వంగర మండలం తులగాం గ్రామానికి చెందిన అరసార కృపారావు, అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన కోటేశ్వరరావు ఉన్నారు. ఈ ముగ్గురూ హత్యా నేరాలపై శిక్షపడినవారు. ప్రసాద్, కృపారావులు 14 ఏళ్ల, కోటేశ్వరరావు ఆరేళ్ల జైలు శిక్ష అనుభవించారు. వ్యవసాయం, వ్యాపారాలు చేసుకుని బతుకుతామని వారు తెలిపినట్టు జైలు సూపరింటెంటెంట్ చెప్పారు.

పంట కుంటలతో ఎంతో మేలు

వర్షాలు కురుస్తుండడంతో నీటితో కళకళ

- » మాకవరపాలెం మండలానికి 400 ఫారం పాండ్స్ మంజూరు
- » ఇంతవరకు 175 పంట కుంటల తవ్వకం పూర్తి
- » కూరగాయ పంటలు, పశుగ్రాసం సాగుకు నీటిని వాడుకుంటున్న రైతులు


బుచ్చన్నపాలెంలో వర్షం నీరు చేరిన పంట కుంట

మాకవరపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఫారం పాండ్స్ (పంట కుంటలు) రైతులకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పంట కుంటల్లోకి నీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. అవసరమైన చోట రైతులు ఆయిల్ ఇంజన్లతో పంట కుంటల్లోని నీటిని కాయగూరపంటలు, పశుగ్రాసం సాగుకు వినియోగించుకుంటున్నారు.

జాతీయ ఉపాధి హామీ పథకం కింద మాకవరపాలెం మండలానికి 400 పంట కుంటలు మంజూరయ్యాయి. వర్షం నీటిని ఒడిసిపట్టుకునేందుకు పొలంలో తగినంత స్థలంతో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు వున్న రైతులు ఈ పథకానికి అర్హులు.


పంట కుంట నుంచి పశుగ్రాసం సాగుకు మోటారుతో నీటిని వినియోగించుకుంటున్న రైతు

మెట్ట భూములకు ఈ పథకం ఎంతో ఉపయోగపడే అవకాశం వుండడంతో పంట కుంటల తవ్వకానికి పెద్ద సంఖ్యలో రైతులు దరఖాస్తు చేస్తున్నారు. అత్యధిక శాతం మంది రైతులకు అనుమతులు లభించాయి. ఉపాధి హామీ పథకం కింద రైతుల కుటుంబ సభ్యులే కుంటల తవ్వకం పనులు చేపట్టారు. ఇంతవరకు 175 పంట కుంటల తవ్వకం పూర్తయ్యింది. తూటిపాల, పాపయ్యపాలెం, అడిగర్లపాలెం, బూరుగుపాలెం, ముసిడిపాలెం, బుచ్చన్నపాలెం, పెద్దిపాలెం, చామంతిపురం, పైడిపాల, శెట్టిపాలెం తదితర గ్రామాల్లో పంట కుంటల తవ్వకం పనులు పూర్తి చేశారు. కొద్ది రోజుల నుంచి చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలతో పంట కుంటల్లోకి నీరు చేరుతున్నది. అవసరం మేరకు పశుగ్రాసం, కురగాయల పంటలకు ఈ కుంటల్లోని నీటిని వాడుకుంటున్నారు.

21 నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

అనకాపల్లి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ నెల 21 నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు కొనసాగుతుందని, ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. పాలీసెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, నాల్గవ తరగతి నుంచి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లతో పాటు పదవ తరగతి మార్కుల లిస్టు, టీసీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు (ఒరిజినల్స్) తో పాటు రెండు సెట్ల జెరాక్స్ తమ వెంట తీసుకురావాలని ఆయన సూచించారు. షెడ్యూల్ ప్రకారం ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులకు ఈ నెల 25 నుంచి 29 వరకు ఆప్షన్ల ఎంపిక ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులైతే రూ. 700లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ. 250లు చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల సీట్ల కేటాయింపు జూలై మూడో తేదీన పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. 21న ఒకటవ ర్యాంకు నుంచి 15 వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. 22న 15 వేల ఒకటి నుంచి 32 వేల వరకు, 23న 32,001 నుంచి 50 వేలు, 24న 54,001 నుంచి 68 వేలు, 25న 68,001 నుంచి 86 వేలు, 26వ తేదీన 86,001 నుంచి లక్షా నాలుగు వేల ర్యాంకు వరకు, 27న లక్షా నాలుగు వేల ఒకటి నుంచి లక్షా 20వేల వరకు ర్యాంకు, 28న లక్షా 20 వేల ఒకటి నుంచి లాస్ట్ ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అలాగే 25, 26 తేదీల్లో ఒకటో ర్యాంకు నుంచి 50వేల ర్యాంకు వరకు ఆప్షన్స్ ఎంపిక జరుగుతుందన్నారు. 27, 28 తేదీల్లో 50 వేల ఒకటి నుంచి 90 వేల ర్యాంకు వరకు, 29, 30 తేదీల్లో 91 వేల నుంచి లాస్ట్ ర్యాంకు వరకు ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం 8142802794 సెల్ నంబరును సంప్రతించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

» డీఈవో జి.అప్పారావునాయుడు

కశింకోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు ఆదేశించారు. బుధవారం స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో జిల్లా స్థాయి మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల నిర్వహణ, బోధన, మూల్యాంకనం, మధ్యాహ్న భోజన పథకం తదితర అన్ని కార్యక్రమాల్లో మార్పు వచ్చిందన్నారు. కొత్త ఆవిష్కరణల్లో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్ బుక్‌లను అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు శతశాతం అమలు చేయాలని సూచించారు. అర్హులందరికీ ఇప్పటికే తల్లికి వందనం నగదు ప్రోత్సాహకాలు తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పారు. అర్హులైన వారు ఎవరికైనా తల్లికి వందనం పథకం వర్తింపు జరగని పక్షంలో సంబంధిత గ్రామ సచివాలయాల్లో తెలియజేసి వారి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అన్ని పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చూడాలన్నారు. పదోన్నతులు, బదిలీల ద్వారా దాదాపుగా అన్ని పాఠశాలలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు వచ్చారన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఎదురైతే సర్దుబాటు చేస్తామన్నారు. ప్రతి విద్యార్థికి అవసరమైన పుస్తకాలు, వస్త్రాలు, బ్యాగులు, బూట్లు అందజేస్తున్నామని తెలిపారు. మారిన మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి విద్యార్థికి అందజేయాలన్నారు. జిల్లాలో మంచి లక్ష్యాలు, ఫలితాలను సాధించే దిశగా ప్రారంభం నుంచే ప్రణాళికాయుతంగా అందరం కలిసి ముందుకు వెళదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు, ఏసీ శ్రీధర్‌రెడ్డి, డిసిసిబి కార్యదర్శి సత్యనారాయణ, సిసి వెంకటేశ్వరరావు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, హాజరైన ఎంఈవోలు, హెచ్‌ఎంలు

జ్వరాల విజృంభణ

... 5వ పేజీ తరువాయి

ఒకటి నుంచి 17వ తేదీ వరకు 18 మలేరియా కేసులు, ఐదు డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. జ్వరం లక్షణాలనుబట్టి పీహెచ్‌సీలలోనే రక్త పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. జ్వరం తీవ్రతనుబట్టి సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆస్పత్రులకు రోగులను తరలిస్తున్నారు. జూన్ నెలలో ఇంతవరకు 392 మంది జ్వరాలతో బాధపడుతూ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఓపీ విభాగానికి వచ్చారు. వీరిలో 131 మంది ఇన్‌పేషెంట్ వార్డులో చేరి వైద్య సేవలు పొందారు. కొత్తకోట సమీపంలోని నాయుడుపాలేనికి చెందిన ఎం.దేముడుబాబు, రావికమతం మండలం మర్రివలస గ్రామానికి చెందిన అనిమిరెడ్డి రాజుబాబు, గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన జి.గోవింద్, కోటవురట్ల మండలానికి చెందిన వంతు కార్తీక్, చీడిపల్లి గ్రామానికి చెందిన ఎం.తులశమ్మ, ధారకొండకు చెందిన పిశైలు, లంబసింగికి చెందిన జె.నాగరత్నం మలేరియా బారినపడి ప్రస్తుతం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు వారాల నుంచి వర్షాలు పడుతుండడంతో తాగునీటి వనరులు కలుషితం కావడం, దోమలు, ఈగల బెడద పెరిగిపోవడంతో వైరల్ జ్వరాలతోపాటు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కోటవురట్ల మండలం కె.వెంకటాపురం పీహెచ్‌సీలో 10 టైఫాయిడ్ కేసులు నమోదు అయ్యాయి.


మలేరియా బారినపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జె.నాగరత్నం, ఎం.దేముడుబాబు

ఏకోపాధ్యాయులకు నిరాశ

... 5వ పేజీ తరువాయి

సమయంలో నగరం, మైదానంలో టీచర్లు మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. అయితే ఎస్జీటీల కొరత ఉండడంతో బదిలీలు తప్పనిసరి అయిన వారిలో చాలామంది నగరం నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని స్కూళ్లకు వెళ్లారు. మారుమూల ప్రాంతాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలకు వెళ్లడానికి ఎవరూ ఇష్టపడలేదు. దీంతో బదిలీ అయిన ఉపాధ్యాయుల నుంచి బాధ్యతలు తీసుకునేవారు లేకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. ఈ విషయమై పలువురు టీచర్ల నుంచి విద్యా శాఖపై ఒత్తిడి రావడంతో సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. బదిలీ అయిన ఏకోపాధ్యాయులంతా కొత్తగా పోస్టింగ్ వచ్చిన పాఠశాలల్లో రిపోర్టు చేసి, తిరిగి ఏకోపాధ్యాయ పాఠశాలకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. త్వరలో డీఎస్సీ నియామకాలు చేపడతామని, కొత్తగా రానున్న టీచర్లను ఏకోపాధ్యాయ పాఠశాల్లో నియమిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అప్పటివరకూ ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే పనిచేయాల్సిందిగా చెప్పడంతో ఏకోపాధ్యాయులంతా నిరాశ చెందారు. ప్రస్తుతం డీఎస్సీ రాత పరీక్షలు నెలాఖరు వరకు జరుగుతాయి. తరువాత ఫలితాలు విడుదల చేసి నియామక షెడ్యూల్ ఖరారుకు కనీసం రెండు, మూడు నెలలు పడుతుందని ఉపాధ్యాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

4,903 మంది టీచర్లకు బదిలీలు

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 4,903 మంది టీచర్లకు బదిలీలు అయ్యాయి. ప్రధానో పాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, లాంగ్వేజ్ పండిట్ల బదిలీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. సెకండరీగ్రేడ్ టీచర్లు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు మాత్రం మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 89 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు 177, స్కూల్ అసిస్టెంట్ తత్సమాన హోదా టీచర్లు 2,305 మంది, ఎస్జీటీలు 2,229 మంది, లాంగ్వేజ్ పండిట్లు 78 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 10 మంది, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు 15 మందికి బదిలీ అయింది.

153 మంది టీచర్లకు పదోన్నతి

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 153 మంది టీచర్లకు పదోన్నతి కల్పించారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా 72 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా 36 మంది, స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఇంగ్లీష్‌లో ఒకటి, హిందీ, తెలుగులో రెండేసి, బయాలజీలో 16, గణితంలో మూడు, సోషల్ స్టడీస్‌లో 9, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 12 మందికి పదోన్నతి వచ్చింది.

క్రైం... crime news

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మునగపాక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆస్పత్రి పాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అరబుపాలెం గ్రామానికి చెందిన బొడ్డేడ రాజా వెంకట ప్రసాద్(48) కొన్ని సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజులు క్రితం పొరపాటున గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరడంతో కుటుంబీకులు చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య యశోధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మునగపాక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్యుతాపురం మండలం నారపాక గ్రామానికి చెందిన కోన ఆదినారాయణ బుధవారం మోటార్ బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరి పరవాడ వైపు వెళుతున్నాడు. అదే సమయంలో పరవాడ నుంచి అచ్యుతాపురం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆదినారాయణ కాలు విరిగిపోయింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అన్న హత్యకేసులో తమ్ముడి అరెస్టు

చీడికాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు గ్రామంలో మంగళవారం జరిగిన హత్యకు సంబంధించి నిందితుడు జోగ దేముళ్లను అరెస్టు చేసినట్టు కె.కోటపాడు సీఐ పైడంనాయుడు తెలిపారు. బుధవారం సాయంత్రం చీడికాడ పోలీసు స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ, గ్రామంలో మంగళవారం అమ్మవారి ఒడ్డు పండుగ నిర్వహించారని, ఈ సందర్భంగా అన్నదమ్ములైన జోగ రాము, దేముళ్లు మద్యం సేవించారని చెప్పారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆవులు, మేకల పంపకాల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఈ క్రమంలో దేముళ్లు తన వద్ద వున్న నాటుతుపాకీతో రామును కాల్చడంతో కుప్పకూలిపోయాడని తెలిపారు. కుటుంబ సభ్యులు చోడవరం ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మృతిచెందాడని చెప్పారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారని, ఈ విషయం తెలిసి పోలీసులు గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించారన్నారు. అయితే ఈ ఘటనపై ఫిర్యాదు చేయడానికి మృతుడి కుటుంబ సభ్యులు ఎవరూ ముందుకు రాలేదని, ఈ క్రమంలో నిందితుడు దేముళ్లు ఇంటిలో ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించగా తాము అడ్డుకుని చీడికాడ స్టేషన్‌కు తరలించినట్టు చెప్పారు. అనంతరం హతుడు రాము కుమారుడు పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశామన్నారు. బుధవారం సాయంత్రం చోడవరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. లైసెన్సు లేని తుపాకులకు వారం రోజుల్లో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పరవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళుతున్న ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును అపహరించిన ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేశామని సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఈ ఏడాది మార్చి 12న గొర్లివానిపాలెం బీసీ కాలనీకి చెందిన గొర్లి దేవి తన కుమారుడితో కలిసి ఇంటి నుంచి పరవాడ బంగ్లా జంక్షన్‌కు నడిచి వెళుతున్నారు. వడ్లపూడి ప్రాంతానికి చెందిన బొండా అరుణ్‌కుమార్ వెనుక నుంచి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని పుస్తెలతాడును తెంచుకుని పరారయ్యాడు.దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. బుధవారం ఉదయం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. ఇతనిపై ఆనందపురం, సబ్బవరం, ఉయ్యూరు, ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో చోరీ కేసులు, దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ వున్నాయి. చోరీ చేసిన పుస్తెలతాడును తాకట్టు పెట్టినట్టు గుర్తించి సదరు కంపెనీ నుంచి పుస్తెలతాడుతోపాటు చోరీకి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఫార్మా ప్రమాదాలకు అంతం లేదా?

... 5వ పేజీ తరువాయి

ప్రత్యేక కమిటీని నియమించింది. అంత భారీ ప్రమాదాన్ని కూడా అధికారులు తేలిగ్గా తీసుకోవడం, యాజమాన్యంపై కఠిన చర్యలు లేకపోవడం వల్ల మిగిలిన సంస్థలు కనీస జాగ్రత్తలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది నవంబరులో ఠాగూర్ ఫార్మాలో విషవాయువులు లీకైన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, మరో 36 మంది అస్వస్థతకు గురయ్యారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్టు అధికారులు వెల్లడించారు. అలాగే రక్షిత్ డ్రగ్స్, విజయశ్రీ ఆర్గానిక్స్ మెట్రోకెమ్ పరిశ్రమల్లో కూడా ప్రమాదాలు సంభవించాయి. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం వాటిల్లలేదు. ఈ తరహా సంఘటనలు పరవాడ ఫార్మా సిటీలోనే అధికంగా జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.

ఉన్నతాధికారుల సూచనలు

- ప్రతి కంపెనీ నైపుణ్యం కలిగిన కార్మికులను నియమించుకోవాలి.
- మూడు నెలలకు ఒకసారి మాక్‌డ్రిల్ నిర్వహించాలి.
- స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానాలు పాటించాలి.
- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి.
- ప్రమాదం జరిగిన వెంటనే అలారం మోగే వ్యవస్థ (బజరింగ్) పెట్టుకోవాలి.
- అక్కడ జరిగే ఉత్పత్తి ప్రక్రియ, రసాయనాలపై ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన కల్పించాలి.

బుచ్చెయ్యపేట ఎంపీడీవో విజయలక్ష్మి కన్నుమూత

... 5వ పేజీ తరువాయి

ఇక్కడ పనిచేయడంతో ఆమెకు మండలంతో ఎంతో అనుబంధం ఏర్పడింది. ఎవరినీ నొప్పించకుండా విధులు నిర్వర్తించేవారని మండల పరిషత్ ఉద్యోగులు, ఇతర శాఖల అధికారులు చెబుతున్నారు. విజయలక్ష్మి భర్త విజయనగరం ఎంపీడీవో పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. విజయలక్ష్మి మృతిపట్ల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కి బ్రేకులు

... 5వ పేజీ తరువాయి

డ్రైవర్లు వాపోతున్నారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించి జీతాలు అందాల్సి వుందని పేర్కొన్నారు. నెలకు రూ.8 వేలు మాత్రమే జీతం ఇస్తున్నారని, ఇందులోనే పీఎఫ్ కట్ చేస్తున్నాయని డ్రైవర్స్ యూనియన్ నాయకుడు పారుపల్లి కృష్ణ అన్నారు. కాగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఆగిపోవడంపై ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. సాంకేతిక సమస్య కారణంగా సిమ్ కార్డులు రీచార్జి కాలేదని, గురువారం నుంచి సమస్య ఉండదని అన్నారు.

యోగా దినచర్య కావాలి

... 5వ పేజీ తరువాయి

అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు లాలం కాశీనాయుడు, కొప్పిశెట్టి వెంకటేష్, యేజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్ధం, ఎన్.వెంకటరాజు, శివదత్తు, ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, నియోజకవర్గం ప్రత్యేక అధికారి శచీదేవి, తహశీల్దారు రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559